www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 జులై 2025



బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

ప్రజాశక్తి - కరప

మండల రెవెన్యూ అధికారిగా తుమ్మల దుర్గాప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు డిటి దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న దుర్గాప్రసాద్

కనీవినీ ఎరుగని రీతిలో గోదావరి పుష్కరాలు

- ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు
- కొవ్వూరుకు వరాల జల్లు
- మలకపల్లి పర్యటనలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - కొవ్వూరు, తాళ్లపూడి

రానున్న గోదావరి పుష్కరాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. సమైక్యాంధ్రలో, నవ్యాంధ్రలో ముఖ్యమంత్రి హోదాలో గోదావరి పుష్కరాలు నిర్వహించానని తెలిపారు. ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో గోదావరి పుష్కరాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లిలో మంగళవారం ఆయన పర్యటించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో మూడు గంటల ఆలస్యంగా ఆయన పర్యటన సాగింది. తొలుత మలకపల్లిలోని చర్మకారుడు సానమాంద్ర పోసిబాబు, వితంతువు గెడ్డం కృష్ణదుర్గ ఇళ్లకు వెళ్లి పింఛను అందించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని జనరల స్టోర్‌ను సందర్శించారు. నిర్వాహకుడు కొండా వెంకటేశ్వరరావు కుటుంబంతో ముచ్చటించారు. తరువాత గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశంలో పెద్ద మొత్తంగా పింఛను అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో వైకల్యం లేకున్నా పింఛన్లు ఇచ్చి ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే వారి విషయంలో కఠినంగా ఉంటానన్నారు. వివిధ కారణాల వల్ల పింఛను తీసుకోకుంటే మూడు నెలల సంబంధించి పింఛను అందించే వెసులుబాటు కల్పించామన్నారు.

రైతులకు అండగా నిలబడ్డాం

రైతులకు తమ ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలబడిందన్నారు. ఇబ్బందులు లేకుండా సాగునీరు, విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. దగ్గరలో ఉండే మిల్లుకే ధాన్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఇన్ పుట్ సబ్సిడీ కూడా రైతుల ఖాతాలకు జమేశామన్నారు. ఈ నెలలో కేంద్రం అన్నదాత సుఖీభవ కింద డబ్బు వేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా జమ చేస్తుందన్నారు.

వీలైనంత త్వరలో నిరుద్యోగభృతికి శ్రీకారం చుడతామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. 2027కి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. డిసెంబర్‌కు డయాఫ్రం వాల్ పనులను పూర్తి చేస్తామన్నారు. గత ఐదేళ్లలో 4 శాతం పనులు పూర్తిచేస్తే ఒక్క ఏడాదిలో తాము 6 శాతం పూర్తిచేశామని తెలిపారు.

కొవ్వూరు అభివద్ధి బాధ్యత నాది

ఓ వైపు గోదావరి, ఇంకోవైపు కడియం, మరోవైపు పాపికొండలు వంటి అందమైన ప్రదేశాలు ఇక్కడ ఉన్నాయని సిఎం తెలిపారు. పర్యాటకం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. కొవ్వూరులో డిగ్రీ కాలేజీ నిర్మిస్తామని, స్థానిక ప్రభుత్వాసుపత్రిని 150 పడకల సామర్థ్యంతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 నుంచి 150 పడకల ఆస్పత్రులు నిర్మిస్తామన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని అన్ని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జల వనరులు శాఖ మంత్రికి సూచించామన్నారు.

పి4లో భాగంగా ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను, కనీసం ఒక లక్షమంది మార్గదర్శులు దత్తత తీసుకునే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దానికి టాటా, బిర్లా, అదానీ, జిందాల్ వంటివారిని పిలుస్తామని తెలిపారు. 2029 సంవత్సరం నాటికి పేదరికం పూర్తిగా నిర్మూలించడమే పి4 ప్రధాన లక్ష్యమన్నారు. రూ.9.55 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి రాష్ట్రంలో 9.55 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.



ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



సర్పంచ్‌కు అవమానం

మంగళవారం మలకపల్లి గ్రామంలో జరిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో సర్పంచ్ రాపాక రాజేశ్వరికి అవమానం జరిగింది. ప్రొటోకాల్ ప్రకారం సభకి సర్పంచ్ అధ్యక్షత వహించాల్సిఉన్నా కనీసం ఆమె పేరు ప్రస్తావించలేదు. పలువురు నాయకులతో సభా వేదికపై ఆమె కూర్చొన్నారు. ప్రోగ్రామ్ షీట్‌లో సర్పంచ్ పేరు లేకపోవడంతో బలవంతంగా ఆమెను బయటకి పంపించేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వైసిపి మద్దతుదారులు గెలిచారు. ఒక్క మలకపల్లి గ్రామంలో మాత్రం టిడిపి మద్దతుదారుగా ఉన్న దళిత మహిళ రాజేశ్వరి సర్పంచిగా ఎన్నికయ్యారు. అలాంటిది స్వయానా టిడిపి అధినేతగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైన సభలో సర్పంచికి స్థానం కల్పించకపోవడం చర్చనీయాంశమైంది. సర్పంచ్‌ని సభా వేదిక పైనుంచి పంపేస్తున్న సమయంలో కనీసం అక్కడ ఉన్న టిడిపి నాయకులు కూడా పట్టించుకోకపోవడం విశేషం.


వృద్ధునికి పింఛన్ అందజేస్తున్న ఎంఎల్ఎ వనమాడి కొండబాబు

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన

ప్రజాశక్తి - కాకినాడ

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అన్నారు. మంగళవారం స్థానిక 34వ డివిజన్ బ్యాంక్ పేటలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి పింఛన్లను అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.4 వేలకు పెంపుదల చేసి అందించడం జరుగుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో గ్రామాలు, పట్టణాలను పూర్తి నిర్లక్ష్యం చేసి పాలన సాగిస్తే కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఏకకాలంలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, పొంగా సత్య, బచ్చు కృష్ణ, కటౌట్ శ్రీను, నక్క సూరిబాబు, సత్తిబాబు, పొంగ సత్య పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు

విద్యార్థులకు దాతలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పెనుమళ్ళ జడ్‌పి పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెనుమళ్ళ పాఠశాలకు కాకినాడకు చెందిన విశ్రాంత అధ్యాపకులు జె.శ్రీకృష్ణ, జె.శ్రీపాప రూ.60 వేలు విలువచేసి 15 ఫ్యాన్లు, వాటర్ ప్యూరిఫై ట్యాంక్, ఇతర సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దాతలు అందిస్తున్న ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ జి.శివనాగు, మాజీ సర్పంచ్ వనుము వీరబ్రహ్మం, సిఆర్‌పి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



7వ తేదీకి వైసిపి సమావేశం వాయిదా

ప్రజాశక్తి - గొల్లప్రోలు

2వ తేదీన జరగాల్సిన పిఠాపురం నియోజవర్గ వైసిపి విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 7వ తేదీకి వాయిదా వేసినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల రీత్యా సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ మార్పును పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గమనించాలని సూచించారు. 7న జరిగే సమావేశానికి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - తుని

జులై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి నక్కల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారంనాడు తుని రూరల్ తేటగుంట గ్రామంలో భవన కార్మికులు, ఇతర కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్ధించాలని, ప్రమాదంలో గాయపడిన, మృతి చెందిన కార్మికులకు పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన కార్మికులు దొరబాబు, ఈశ్వరరావు. వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

మండలంలో ఎంఎల్ఎ సత్యప్రభ పర్యటన

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని పలు గ్రామాల్లో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ మంగళవారం పర్యటించారు. రూ.1.60 కోట్లతో రాజవరం నుంచి దిగువాసువాడ గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం గురుకుల పాఠశాలలో విద్యామిత్ర కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. అనంతరం ఇటీవల ప్రమాదానికి గురియైన బలరామపురం గ్రామానికి చెందిన యలమంచిలి గంగాభవానిని ఆమె పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ రాము, ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపిపి భాస్కర్‌బాబు, సర్పంచ్ పైల సీత, ప్రిన్సిపల్ బుమ శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు శ్రీసోమరౌతు రవి, తదితరులు పాల్గొన్నారు.


విద్యా కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా శ్రీనివాసరావు ఎన్నిక

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వర లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు ఎంపికైనట్లు లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చిత్తలూరి వీర్రాజు తెలిపారు. మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జూలై నుంచి లయన్స్ ఇయర్ ప్రారంభం అవుతుందన్నారు. నాలుగు రోజులు క్రితం లయన్స్ భీమేశ్వర సామర్లకోట నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతన అధ్యక్షులుగా ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా బడుగుసీతారామ స్వామి, కోశాధికారిగా ఏలేటి రమేష్ ఎన్నికయ్యారని తెలిపారు. అనంతరం లయన్స్ డిస్టిక్ గవర్నర్ ఈదల ఈశ్వర్‌కుమార్, తదితర సభ్యులు నూతన కమిటీని దుస్సాలువాతో సత్కరించి అభినందించారు. అలాగే జూలై 6న జూనోసిస్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలలో ఉదయం 9 గంటల నుంచి పెంపుడు జంతువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అనంతరం లయన్స్ సభ్యులు ఎస్‌వివి. సూర్యనారాయణమూర్తి సుమారు రూ.4 లక్షలతో ప్రభుత్వాసుపత్రిలో నిర్మించిన ఒక షెడ్, ఒక రూమ్‌ను ప్రారంభించడం జరుగుతుందన్నారు. అలాగే లయన్స్ క్లబ్ పైభాగంలో ఎయిర్ కండిషన్‌తో నూతనంగా నిర్మించిన ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం లయన్స్ భీమేశ్వర నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, వైసిపి నాయకులు దవులూరి సుబ్బారావు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు విజయ్‌కృష్ణ, సేపేని సురేష్, మద్దాల శ్రీను, కాపుగంటి పైడిరత్నం, కర్రి ఆదినారాయణ రెడ్డి, వేగు సత్తిబాబు పాల్గొన్నారు.



నూతన కమిటీని అభినందిస్తున్న ప్రతినిధులు

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన సాగి తులసికి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కును టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అందజేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ చెక్కును అందజేశారు. అనారోగ్యంతో ఆర్థిక స్థోమత లేకపోయినా అప్పులు చేసి చికిత్స పొందిన బాధితురాలి విజ్ఞప్తి మేరకు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సిఫార్సుతో సిఎంఆర్ఎఫ్ నుంచి రూ.2,03,803 మంజూరైంది. ఆ చెక్కును నవీన్ అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవరపల్లి మూర్తి, మారిశెట్టి రాధా, గండేపల్లి మండల తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి యర్రంశెట్టి మణికంఠ పాల్గొన్నారు.


సిఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న జ్యోతుల నవీన్

ఉత్తమ విద్యార్థులకు ప్రతిభ అవార్డ్స్

ప్రజాశక్తి - జగ్గంపేట

10వ తరగతిలో ప్రథమ ర్యాంకు సాధించిన ఇద్దరు విద్యార్థులకు స్వర్గీయ మీసాల తాతారావు జయంతి సందర్భంగా మంగళవారం ప్రతిభ అవార్డ్స్ అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివి 549 మార్కులు సాధించిన లక్కాకుల నందిని, 479 మార్కులు సాధించిన అడపా సామ్యూల్‌లకు రూ.5 వేలు చొప్పున నగదు పురస్కారాన్ని మీసాల బంగారమ్మ చేతుల మీదుగా అందించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్కాకుల శీను, వెంట్రాప్రగడ రమేష్, జాజుల అచ్యుత్, విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


నగదు పురస్కారాన్ని అందిస్తున్న నిర్వాహకులు

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఇంటింటా సేకరిస్తున్న పారిశుధ్య పనులను ఎంపిడిఒ కె.స్వప్న మంగళవారం పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు మెరుగు పరచాలని, తడి పొడి చెత్తను వేరుచేసి సేకరించాలని సిబ్బందికి ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ విజయ్‌సాగర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ వైస్ ఛైర్మన్

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని 7, 9, 10 వార్డుల్లో మంగళవారం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుధ్యం, మురుగునీటి కాలువల నిర్వహణను పరిశీలించారు. అలాగే మంచినీటి సరఫరా తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఏరోజు చెత్త పోగులు ఆ రోజే తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ పివి.సుధాకర్, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కరరావు, విజ్జపు రాజశేఖర్, పలువురు వైసిపి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యలను తెలుసుకుంటున్న సాయిప్రసాద్

91 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలో 91 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ జె.రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 23 సచివాలయ పరిధిలో 9793 మందికి పెన్షన్లు పంపిణీ చేయవలసి ఉండగా 8960 మందికి పింఛన్లు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన పింఛన్‌దారులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నారని, వారికి ఈ నెలతో పాటు వచ్చే నెలలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.


56వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్య ల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 56వ రోజుకు చేరుతుంది. మున్సిపల్ సెంటర్లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, సంఘ సభ్యులు బాసిన భద్రరావు, అయ్యప్ప స్వామి, పూల ప్రశాంత్, మలిపెద్ది భద్రరావు, జి.నాగేశ్వరరావు, ఎస్‌కె.బషీర్, జి.సతీష్, బొమ్మన రవికుమార్, సత్తిరాజు, ఒ.సోనియా పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న కార్మికులు

కార్టూ'నిజం'



ఒబిసి వర్గీకరణతోనే అందరికీ న్యాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

దేశంలో ఒబిసి వర్గీకరణతోనే ఉప కులాలకు న్యాయం జరుగుతుందని జాతీయ సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డి కామరాజు అన్నారు. మంగళవారం స్థానిక జి.రాగంపేట పుంత రోడ్డులోని కొండయ్య పేట కమ్యూనిటీ భవనంలో జరిగిన సంఘ సభ్యుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షులు వేమగిరి ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒబిసిలో ఉన్న మేజర్ కులాలన్నీ రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు పొందుతుండగా ఉప కులాలకు న్యాయం జరగటం లేదన్నారు. ఎస్‌టిలలో కూడా అదే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఏజెన్సీలో నివసిస్తున్న ఎస్‌సి, బిసిలకు ఎస్‌టి రిజర్వేషన్ వర్తింప చేయాలన్నారు. మతం మారినంత మాత్రాన వారి సామాజిక హోదా మారదని, మతంతో సంబంధం లేకుండా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సంకు దావీదురాజు, ముమ్మిడివరపు వెంకటరమణ, మడికి చంద్రావు, చావా వెంకటేశ్వరరావు, కందుకూరి శ్రీను, బత్తిన అశోక్ కుమార్, నక్కా వీరబ్రహ్మం, మండవిల్లి రుద్రయ్య పాల్గొన్నారు.




రేషన్‌ను పంపిణీ చేస్తున్న డీలర్

లబ్ధిదారుల చెంతకు రేషన్ సరుకులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపాలిటీ. 4వ వార్డ్‌కు చెందిన కోదండరామపురం శివారు ప్రాంతం ప్రజల చెంతకు జూలై నెల మొదటి రోజున ప్రభుత్వ రేషన్ సరుకులు అందుకున్నారు. ప్రభుత్వ చౌక ధరల దుకాణం నుంచి బియ్యం తెచ్చుకోవాలంటే ఆరున్నర కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిందే అంటూ ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు స్పందించారు. కోదండరామపురం కాలనీకి చెందిన లబ్ధిదారులు ఆరున్నర కిలోమీటర్లు వెళ్లి సరుకులు తీసుకోవాల్సిన పని లేకుండా సంబంధిత డీలర్ స్వాతి ప్రత్యేక వాహనంలో సరుకులు రప్పించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నేరాలు ఘోరాలు

మూడు మట్టి లారీలు సీజ్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని మసకపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 8 భూమి నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న 3 లారీలను సీజ్ చేసినట్లు ఆర్‌డిఒ దేవరకొండ అఖిల తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, పోలీసులతో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకుండా గోండ్రు మట్టిని తరలిస్తున్న 3 లారీలను సీజ్ చేశారు. లారీలను భూగర్భ గనుల శాఖకు అప్పగించడం జరిగింది. ఈ తనిఖీల్లో తహశీల్దార్ శ్రీరామ్, ఆర్‌ఐ, విఆర్‌ఒ, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాజులూరు మండలం మంజేరుకు చెందిన పలువురు తలుపులమ్మలోవ వెళ్లూ మార్గమధ్యలో చేబ్రోలు జాతీయ రహదారి పెట్రోల్ బంక్ వద్ద ఆటో ఆపి టిఫిన్ చేస్తున్నారు. అదే సమయంలో తాళ్ళరేవు నుంచి వైజాగ్ వెళుతున్న కారు వేగంగా వచ్చి డివైడర్ దాటుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. అదేవేగంతో రోడ్డుపక్కన ఆగివున్న ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న చేబ్రోలు గ్రామానికి చెందిన ఓరిగంటి అప్పలరాజు, కర్రి చక్రం గాయపడ్డారు. వీరిని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆగివున్న ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో నందిగంపాడు గ్రామానికి చెందిన ఆత్కూరి పెద్ద సత్యనారాయణ(51) మంగళవారం పాముకాటుకు గురై మృతి చెందాడు. పశువుల కోసం మంగళవారం ఉదయం సత్యనారాయణ గడ్డి కోసేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ గడ్డి కోస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వెంటనే అతన్ని మోటార్ సైకిల్‌పై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు పోలవరం కాలువ వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్‌ఐ రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేశారని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.10,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



కుట్టిన బట్టలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాంబాబు

పారిశ్రామికవేత్తలుగా రాణించాలి

ప్రజాశక్తి - కాజులూరు

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని ఎంపిడిఒ జె.రాంబాబు సూచించారు. మంగళవారం స్థానిక మానవ వనరుల సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి మహిళకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ కార్యనిర్వహణాధికారి మహాలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ మైధిలి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ సహకారంతో నిర్వహించిన ఈ క్యాంటీన్‌ను జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రారంభించి పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బుద్ధిరెడ్డి శ్రీనివాస్, నాయకులు మాధరపు వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరావు, మొగిలి గంగాధర్, అడబాల వీరబాబు, సత్తి సోమరాజు, గంధం శ్రీను పాల్గొన్నారు.

నాణ్యంగా మిడ్డే మీల్స్

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలని ఎంఇఒ-2 పి. పుల్లయ్య ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. తొలుత ఎంతమంది విద్యార్థులు పాఠశాలలు హాజరయ్యారు ఎంతమంది భోజనాలకు హాజరయ్యారు అన్ని రికార్డులను ఆయన పరిశీలించారు అలాగే పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ డాక్టర్స్ డే

ప్రజాశక్తి - సామర్లకోట, జగ్గంపేట

నేషనల్ డాక్టర్స్ డే పురస్కరించుకుని భీమేశ్వర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు సీనియర్ వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు డాక్టర్‌చందలాడ అనంతపద్మనాభం, డాక్టర్ చాగంటి సన్యాసిరావు, డాక్టర్ వల్లీదేవి, డాక్టర్ ఎస్.మహోన్నత్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ జిల్లా అధ్యక్షులు ఈదల ఈశ్వరకుమార్, జిల్లా ఛైర్మన్ చిత్తులూరి వీర్రాజు మాట్లాడుతూ డాక్టర్స్ డే పురస్కరించుకుని వైద్యులను సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ నూతన అధ్యక్షులు అమల



జగ్గంపేటలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు



సామర్లకోటలో వైద్యుడిని సత్కరిస్తున్న లయన్స్ క్లబ్

కంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు బాబీ, కోశాధికారి యేలేటి రమేష్, నాయకులు సేపేని సురేష్, కానుబోయిన విజయ కృష్ణ, వేగు సత్తిబాబు పాల్గొన్నారు.అలాగే జగ్గంపేట సిహెచ్‌సి, రాజాపూడి పిహెచ్‌సిలలో డాక్టర్స్ డేను ఘనంగా నిర్వమించారు. సిహెచ్‌సి సూపరింటెండెంట్ ప్రణీత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆసుపత్రిలోని సిబ్బంది వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాజపూడి వైద్యులు ఎన్.పూజ, ఎం.మురళి కేక్ కట్ చేయించారు. వైద్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

తురక కొండపై సర్వే

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని కొడవలి గ్రామంలోని బౌద్ధరామం సమీపంలో తవ్వకాలు చేపట్టిన తురక కొండపై అధికారులు మంగళవారం సర్వే చేశారు. లీజు దారులు ఎంత మేరకు తవ్వకాలు జరిపారనే అంశంపై ఆరా తీశారు. ఈ కొండపై చేపట్టిన తవ్వకాలపై విమర్శలు రావడంతో ప్రస్తుతానికి నిలిపివేశారు. ఈ సర్వేలో మైనింగ్ శాఖ టెక్నికల్ సిబ్బంది, స్థానిక ఆర్‌ఐ బాలకృష్ణ, విఆర్‌ఒ గోవిందరాజు పాల్గొన్నారు.



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, స్థానికులు

వల్లభ స్వామి హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, డివిజన్ అధికారి వి.ఫణీంద్రకుమార్, సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి సమక్షంలో 104 రోజులకు సంబంధించిన హుండీలను తెరిచి లెక్కించారు. సాధారణ హుండీల ద్వారా రూ.23,89,935, అన్నదాన హుండీల ద్వారా రూ.7,76,146లు మొత్తం రూ.31,66, 081 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గొల్లప్రోల

మండలంలోని గ్రామాలకు 24 గంటలు విద్యుత్ సరఫరా కోసం చేపట్టే విద్యుత్ లైను నిర్మాణం నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాటిపర్తి, చిన జగ్గంపేట మరియు ఆక్వా, పరిశ్రమలకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎల్‌ఐసి విస్తరణలో యూనియన్ పాత్ర కీలకం

ప్రజాశక్తి - తుని

జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసి) జాతీయ స్థాయిలో విస్తరణకు ఎల్‌ఐసి ఉద్యోగ సంఘాలు కీలకపాత్ర పోషించాయని ఎల్‌ఐసి ఉద్యోగ సంఘాల సీనియర్ నాయకులు జి.శోభనకుమార్ అన్నారు. శుక్రవారం తుని ఎల్‌ఐసి బ్రాంచ్‌లో జీవిత బీమా ఉద్యోగ యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎల్‌ఐసి ఉద్యోగ సంఘాల పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసి సంస్థ ప్రారంభం కాకముందే యూనియన్ ఆవిర్భవించడం జరిగిందని, ఎల్‌ఐసి సంస్థను జాతీయస్థాయిలో తీసుకెళ్లడానికి యూనియన్ కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు.



ఉద్యోగ సంఘాల పతాక ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

సీనియర్ ఎల్‌ఐసి బ్రాంచ్ మేనేజర్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ 1956 సంవత్సరంలో ఎల్‌ఐసి సంస్థ రూ.5 కోట్లతో ప్రారంభించగా నేడు ప్రపంచంలోనే రూ.54 లక్షల కోట్ల ఆస్తులతో అతిపెద్ద ఆర్థిక సంస్థగా ఎదిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కెఎన్‌వి.సత్యనారాయణ, శర్మ, రామ సత్యనారాయణ, విజయకుమార్, రామకృష్ణ, జయలక్ష్మి, గంగాధర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - తుని

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ యనమల దివ్య అన్నారు. మంగళవారం తుని రూరల్ తేటగుంట పంచాయతీలో ఉన్న గవరపేట గ్రామంలో పర్యటించారు. ప్రజల సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్జి అప్పలరాజు, యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, గజ్జి రాంబాబు, కొల్లి సత్యనారాయణ, చామంతి సత్తిబాబు, పప్పు నవీన్, తమరాన వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ సొమ్మును అందిస్తున్న ఎంఎల్‌ఎ దివ్య

మద్యం బెల్ట్ షాపులను ఎత్తివేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో మద్యం బెల్ట్ షాపులను ఎత్తివేసేలా ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని చినవలసల జడ్‌పి పాఠశాల ఎస్‌ఎంసి వైస్ ఛైర్మన్ బొడ్డు రాజేశ్వరి డిమాండ్ చేశారు. మంగళవారం చినవలసల గ్రామంలోని ఆమె నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాళ్లరేవు, సీతారాంపురం మద్యం దుకాణాల నుంచి మద్యాన్ని తెచ్చి మత్స్యకార గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా అమ్మకాలు చేస్తున్నారని ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా వారి నుంచి ఎటువంటి స్పందన లేకుండా పోయిందని అన్నారు. బెల్ట్ షాపుల్లో కల్తీ మద్యాన్ని అమ్ముతున్నట్లు ఆమె ఆరోపించారు. గుడ్డివాని తూము సెంటర్, తాళ్లరేవు మద్యం షాపుల వద్ద మద్యం సేవించడానికి షెడ్లు ఏర్పాటు చేశారని అన్నారు. తాళ్ళరేవు సంతపేట సెంటర్లో ఉన్న మద్యం షాపు వల్ల హైస్కూలు, కళాశాల విద్యార్థులు, సోమవారం సంత రోజున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి మద్యం బెల్ట్ షాపులను ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఫిర్యాదు కాపీని చూపుతున్న బొడ్డు రాజేశ్వరి

సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కోటనందూరు

మండలంలోని జగన్నాధపురం గ్రామంలో సైబర్ నేరాలపై మంగళవారం అవగాహనా సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఎస్‌ఐ టి.రామకృష్ణ మాట్లాడారు. గ్రామంలో ప్రధాన కూడలి, దేవాలయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, మొబైల్స్ వినియోగిస్తున్న యువకులపైన తల్లిదండ్రులు దృష్టి సారించాలని అన్నారు. రమ్మీ ఇతర గేములు ఆడడానికి ఆన్‌లైన్‌లో యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవడం, తర్వాత నష్టపోయి అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడటం వంటి సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు పాల్పడితే పోక్స్ చట్టం ద్వారా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ యు.ఉమామహేశ్వరి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ సతీష్‌రెడ్డి అనపర్తి ప్రభుత్వాసుపత్రికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పెద్దాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వరి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు.




డాక్టర్ ఉమామహేశ్వరి

పంట కాలువపై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ సీతారామపురంలోని పెట్రోల్ బంక్ వెనక పంట కాలువ వంతెనపై ఆక్రమణలను పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. నీటి ప్రవాహానికి అవరోధంగా మారుతున్న ఈ దుకాణాలు తొలగించాలని శివారు రైతులు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ, రెవెన్యూ అధికారుల సమక్షంలో జెసిబితో తొలగించేందుకు సిద్ధపడ్డారు. పక్కా నిర్మాణం చేసిన దుకాణం తాళం పగులగొట్టి అందులో సామానులు పంచాయతీ కార్యాలయానికి తరలించారు. సాయంత్రానికి దుకాణం స్వచ్ఛందంగా తొలగిస్తామని చెప్పడంతో అధికారులు అవకాశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్లరేవు, పి.మల్లవరం పంచాయతీ కార్యదర్శులు నున్న శంకరనారాయణ, సూరంపూడి వెంకట రమణ, విఆర్‌ఒ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



దాతను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు కంచాలు అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చంద్రమాంపల్లి జడ్‌పిఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎస్.తిమ్మాపురంకు చెందిన భావిశెట్టి గణపతి భోజనం కంచాలను అందజేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో దాత సొంత ఖర్చుతో విద్యార్థులందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం శ్రీవల్లి, ఎస్‌ఎంసి ఛైర్మన్ లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేలంగి వెంకట్రావు, టిడిపి మండల అధ్యక్షులు మొయిళ్ళ కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు, చంద్రమాంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు రేలంగి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.